ప్రజాశక్తి
శుక్రవారం 19 జులై 2024 | 5 | విజయనగరం



వర్షాల పట్ల అప్రమత్తం : కలెక్టర్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

భారీ వర్షాలను ఎదుర్కోడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విసి లో జిల్లా పరిస్థితిని కలెక్టర్ వివరించారు. భారీ వర్షాలను ఎదుర్కోడానికి జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు విసిలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. మూడు రోజులు పాటు ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు డిఆర్ఒ ఎస్.డి.అనిత తెలిపారు. భారీ వర్షాలు, గాలులతో ఎక్కడైనా అత్యవసర సహాయం అవసరమైతే కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ 08922 236947కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వైద్యం అందాలంటే కొండ దిగాల్సిందేనా?



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గూనబాడు, కురిడి, పల్లపు దుంగాడ గ్రామాల గిరిజనులు

- గిరి శిఖర గ్రామాల్లో జ్వరాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- అందని వైద్యసేవలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గిరి శిఖర గ్రామాల గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. వైద్యం అందాలంటే సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి డోలీ మోతతో కొండల పైనుంచి మైదాన ప్రాంతమైన ఎస్.కోట ఆస్పత్రికి తరలించాల్సిన దుస్థితి నెలకుంటోంది. ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన వైద్య సిబ్బంది సైతం కానరవడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గిరి శిఖర గ్రామాలైన దారపర్తి, మూలబొడ్డవర పంచాయతీల పరిధిలో గిరిజనులకు వైద్యం అందక డోలి మోతలతో కొండ పైనుండి మైదాన ప్రాంతానికి వచ్చి ఆసుపత్రులలో వెళ్లేసరికి వ్యాధి తీవ్రమై మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

మండలంలోని గిరి శిఖర గ్రామాల్లో ఏటా జ్వరాలు, వ్యాధులతో మరణాలు సంభవిస్తున్నాయి. వైద్యసేవలు అందుబాటు లేకపోవడం వల్ల గిరిజనులు ఆర్‌పిఎంలను ఆశ్రయిస్తున్నారు. వారం పదిరోజులు వరకు తగ్గకపోతే డోలీలతో కొండ దిగువకు రోగులను మోసుకొచ్చి ఎస్.కోట ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈలోగా పరిస్థితి విషమించి రోగుల ప్రాణాలు పోతున్న పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈనేపథ్యంలోనే మూలబొడ్డవర పంచాయతీ జిల్లోడులోవ గ్రామానికి చెందిన చిన్నారి చదరంపోతురాజు (3) మలేరియా బారినపడి మృతి చెందాడు.

మండలంలోని కొట్టాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా గిరిశిఖర గ్రామాల్లో ఎక్కువగా గిరిజనులు మరణాలు సంభవిస్తున్నా యనే ఉద్దేశంతో వారికి అందుబాటులో ఉండేలా బొడ్డవర పరిసర ప్రాంతంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. అందుకు మండలంలో 18 సచివాల యాలను విడదీసి 9 సచివాలయాల పరిధిలో గిరిశిఖర గ్రామాలను కలుపుతూ బొడ్డవర పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాల వారికి వైద్యాన్ని అందించేందుకు అదనంగా ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎంలను నియమించినప్పటికీ వారు మైదాన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపుల పేరుతో గిరిజనులను గాలికి వదిలేసారు దీంతో వర్షాకాలం మొదలైన తర్వాత గిరిజనులకు అవగాహన కల్పించే వారు లేక సుమారు 150 మంది వరకు జ్వరాల బారిన పడ్డారు. వైద్య సిబ్బంది గిరిశిఖర గ్రామాలకు వెళ్లకపోవడంతో ఇదే అదునుగా ఆర్ఎంపి డాక్టర్లు గిరిజనులకు వైద్యం పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించగా మరి కొంతమంది పట్టణంలో ఏరియా ఆసుపత్రికి వచ్చి చేరుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు చిట్టెంపాడు, గూనపాడు గ్రామాలలో వరస మరణాలు సంభవించడంతో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు ఆ గ్రామాల్లో పర్యటించారు. మరో రెండు నెలల తర్వాత మరొక మరణం సంభవించడంతో డిఎంఅండ్‌హెచ్ పర్యటించారు. అయినప్పటికీ ఈఏడాది రెండుసార్లు మాత్రమే గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. తరువాత గిరి శిఖర గ్రామాల వైపు కన్నెత్తి చూసే వైద్యుడే లేకపోవటంతో దారపర్తి, మూలబొడ్డవర గ్రామాల్లో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ విష జ్వరాల బారిన పడుతున్నారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు ఎస్.కోటలో జరిగిన సభలో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, చిట్టెంపాడులో వరుస మరణాలు విచారకరమని అన్నారు. తాజాగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజ శిఖర గ్రామాలకు వైద్యసేవలు అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

మలేరియాతో చిన్నారి మృతి



చిన్నారి పోతురాజు

మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ జిల్లోడులోవ గ్రామంలో మలేరియా బారిన పడి చిన్నారి చదరం పోతురాజు(3) గురువారం చెందాడు. భీమరాజు, సీతకు మూడో సంతానమైన పోతురాజుకు నాలుగు రోజుల క్రితం జ్వరంతో రావడంతో సరైన వైద్యం అందక మృతి చెందాడు. తండ్రి భీమరాజు కూడా జ్వరంతో బాధపడుతున్నాడు. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఇలాంటి మరణాలు జరుగు తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు గౌరీష్ డిమాండ్ చేశారు. చనిపోయిన బాలుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దారపర్తి పంచాయతీ, మూల బొడ్డవర పంచాయతీ గిరిజన గ్రామాల్లో త్వరితగతిన మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

మండలంలోని గిరిజన గ్రామాల్లో వ్యాధులు, జ్వరాలు ఉన్నందున వెంటనే అధికారులు స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలి. జిల్లేడులోవల తాగునీరు లేకపోవడంతో గిరిజనులంతా కలుషిత నీటిపైనే ఆధారపడు తున్నారు. దీంతో జ్వరాల బారినపడుతున్నారు. . వైద్య సిబ్బంది కూడా గ్రామాలకు వెళ్లడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులకు తక్షణం అవగాహన కల్పించాలి.

మద్దిలరమణ, సిపిఎం నాయకుడు

బొడ్డవరలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

గిరి శిఖర గ్రామాలకు కొండ దిగువన ఉండే బొడ్డవర ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు చాలాసార్లు వినతులు ఇచ్చాం. అనారోగ్యం బారినపడి గిరిజనులు ప్రాణాలు పోతుంటే నాయకులు, అధికారులు సానుభూతి చూపిస్తున్నారు తప్ప సమస్య పరిష్కారానికి ప్రయత్నించటం లేదు. వెంటనే గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

జరత గౌరీష్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు



ఓబులయ్యపాలెంలో కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

- గ్రామసందర్శనలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- అంగన్‌వాడీ, పాఠశాలల సందర్శన, పనితీరుపై ఆరా

ప్రజాశక్తి-వేపాడ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన గ్రామ సందర్శన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. అందులోభాగంగా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వేపాడ మండలంలో పర్యటించి ఓబులయ్యపాలెంలో మండల నోడల్ అధికారి పి.ఎన్.వి.లక్ష్మీ నారాయణ, అధికారుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాల్వల్లో చెత్తను తొలగించకుండా మురికినీరు పారే పరిస్థితి లేకపోవడంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వర్షాకాలంలో కాల్వలు పూడుకుపోయి వుంటే రోగాలకు అవకాశం ఏర్పడుతుందని, వెంటనే పూడిక తీయించి నీటిని నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. గ్రామంలో జ్వరాల గురించి మలేరియా కేసుల గురించి ఆరా తీశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పిల్లల హాజరు గురించి తెలుసుకున్నారు. 14 మంది పిల్లలకు గాను ఏడుగురే హాజరు కావడంపై కార్యకర్తను ప్రశ్నించారు. గ్రామంలో ఆరేళ్లలోపు పిల్లలు 30 మంది వుంటే అందులో 14మంది మాత్రమే ఎందుకు అంగన్‌వాడీకి వస్తున్నారని ప్రశ్నించారు. పలువురు బాలల బరువును తూకం వేయించి వయసుకు తగిన బరువు వున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించి వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగు పరచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలన సందర్శించి విద్యార్థుల సంఖ్యపై హెచ్ఎంను ప్రశ్నించారు. 750 కుటుంబాలు నివసిస్తున్న గ్రామంలో కేవలం 23మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. శనివారం నాటికల్లా విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లలోని అన్ని వస్తువులు అందాలని నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఐదో తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వివిధ సబ్జెక్టుల్లో వారి విషయ పరిజ్ఞానం తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లగా కలెక్టర్ వాటి పరిష్కారంపై నివేదికలు అందించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. గ్రామంలోని బి.సి.కాలనీకి చెందిన టి.ముత్యాల నాయుడు తమ కాలనీలో వున్న మార్గాన్ని కొందరు మూసివేయడంతో బయటకు వెళ్లాలంటే పన్నెండు కుటుంబాలకు చెందిన వారు ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వివరించడంతో దీనిపై విచారణ జరిపి నివేదించాలని కలెక్టర్ తహశీల్దార్‌ను ఆదేశించారు.

పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి

సచివాలయ కార్యదర్శులకు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-గజపతినగరం

ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు పెట్టుబడిన సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.20వేలు అందజేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ పురిటిపెంట -1, బొండపల్లి మండలం గొల్లుపాలెంలో ఎపి రైతు సంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సచివాలయ కార్యదర్శులకు రైతులు వినతులు అందజేశారు. పురిటిపెంటలో గత ఏడాది వర్షాభావ పరిస్థితుల 40 ఎకరాల్లో పంటలు దెబ్బతిని 25 మంది రైతులు నష్టపోయారని, వారికి పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం కింద రూ.20వేలు చొప్పున వెంటనే అందజేయాలని కోరారు. వినతినిచ్చిన వారిలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, రైతుసంఘం నాయకులు దాసరి సింహాద్రి, మునకాల రాములప్పలస్వామి, రైతులు పాల్గొన్నారు. గొల్లుపాలెంలో సచివాలయ కార్యదర్శికి వినతినిచ్చారు. రైతులకు పెట్టుబడిసాయం అందించాలని కోరారు. రైతు సంఘం నాయకులు తొత్తడి పైడిపునాయుడు, దేవుడు, ఈదుబిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్ సర్వీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 20,21 జరుగుతున్న సింహాచలేశ్వరుని గిరిప్రదక్షిణ కు హాజరవుతున్న ప్రయాణికుల కోసం ఆర్‌టిసి విజయనగరం డిపో నుంచి సింహాచలంకు 40 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

ఊపిరి పోసిన వర్షం

- వరినారు పెరుగుదలకు, నాట్లు వేసేందుకు అవకాశం
- మొక్కజొన్న, పత్తి పంటలకూ అనుకూలం
- నువ్వుల పంటకు కాస్త నష్టమే



నాట్లు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులు పంటల సాగుకు ఊపిరిపోశాయి. ముఖ్యంగా వరి నారు పెరుగుదలకు, పలుచోట్ల వరి నాట్లు వేసేందుకు అవకాశముంది. మొక్కజొన్న, పత్తి, చెరకు పంటలు ఏపుగా పెరిగేందుకు ఎంతో దోహదపడుతోంది. నువ్వులపంటకు మాత్రం కాస్త నష్టం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా జూన్ రెండో వారం నుంచే జిల్లాలో ఖరీఫ్ పంటల సీజన్ మొదలవుతుంది. ఆ నెలలో వర్షాలు అనుకూలించాయి. సాధారణ వర్షపాతం 123.5 మిల్లీ మీటర్లు కాగా, 113.6 మి.మీ వర్షం కురిసింది. దీంతో చాలా మంది నారుమడులు సిద్ధం చేశారు. చెరకు, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటల సాగు జరిగింది. ఈనెల ఆరంభం నుంచి వర్షపులోటు మొదలైంది. 3వ తేదీ నాటికి 98.2 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీంతో, ఇప్పటికీ పూర్తిస్థాయిలో వరి నారుపోయలేదు. వేసిన నారు నీటి ఎద్దడికి గురైంది. కొన్నిచోట్ల నారును బతికించుకునేందుకు టాంకర్లతో తడుపుకోవాల్సిన పరిస్థితి కూడా కనిపించింది. దీంతో, రైతులు ఒకింత టెన్షన్‌కు గురయ్యారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు క్రమంగా లోటు తగ్గింది. ప్రస్తుతం లోటు వర్షం 28 మి.మీలకు తగ్గింది. గురువారం జిల్లా అంతటా ఎడతెరిలేకుండా వర్షపు జల్లులు కురడవండంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,99,455 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 27,097 ఎకరాలు సాగయ్యాయి. ఖరీఫ్ మొత్తంలో అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా, ఇప్పటి సుమారు వరకు 7,422 ఎకరాల్లో వరి నారు వేశారు. మెట్ట ప్రాంతంలో యద, డ్రమ్ సీడర్, నీటి వసతి ఉన్నచోట ఉబాలు ప్రారంభించారు. ఈ పద్ధతుల్లో ఇప్పటి వరకు సుమారు 3వేల ఎకరాల్లో నాట్లు కూడా పడ్డాయి.

మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 35,055 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 8,410 ఎకరాల్లో సాగు కనిపిస్తోంది. పత్తి సాధారణ విస్తీర్ణం 6,707 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1447 ఎకరాల్లో సాగైంది. చెరకు సాగు విస్తీర్ణం 15,040 ఎకరాలు కాగా కేవలం 2,800 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. ఈ మూడు పంటలు ఆకులు తొడిగి, ఎదిగే దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో నువ్వుల సాగు సాధారణ విస్తీర్ణం 14,007 ఎకరాలు కాగా, ఏప్రిల్, మేనెలల్లో వాతావరణ పరిస్థితులు పెద్దగా అనుకూలించకపోవడంతో కేవలం 5,487 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ప్రస్తుతం పువ్వుదశలో ఉంది. పువ్వులపై వర్షం పడితే అవి ఆకు కట్టే ప్రమాదం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

73.6మిల్లీమీటర్ల వర్షం

జిల్లా వ్యాప్తంగా గురువారం 73.6 మి.మీ. వర్షం కురిసింది. అత్యధికంగా బొబ్బిలిలో 9.4మి.మీ.నమోదు కాగా, అత్యల్పంగా రాజాం, కొత్తవలస మండలాల్లో 0.3మి.మీ. వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ స్వల్ప వర్షాలు కురిశాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని వైసిపిజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. వినుకొండలో టిడిపి వారు వైసిపి కార్యకర్తను హత్య చేశారని, అది రాజకీయ హత్యేనని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్యని అన్నారు. గురువారం జెడ్పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి నాయకులు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని అన్నారు. వినుకొండలో తమ పార్టీ కార్యకర్తను అత్యంత పాశవికంగా రాజకీయ హత్య చేసి దాన్ని వ్యక్తిగత హత్యగా చిత్రీకరించడం పట్ల తీవ్రంగా ధ్వజమెత్తారు. పుంగనూరులో టిడిపి దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లిన ఎంపీ మిధున్ రెడ్డిపై కూడా దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ రెండు ఘటనలను తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఒక పార్లమెంటు సభ్యుడికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్య కార్యకర్తలకు ఏవిధమైన రక్షణ కల్పిస్తుందన్నారు. ఒక ఎంపీపై రాళ్ల దాడి చేస్తుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులే చోద్యం చూస్తుంటే ఏవిధమైన ఆటవిక పాలన కొనసాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. అధికారం శాశ్వతం కాదు అనేది గుర్తుంచుకొంటే బాగుంటుందని ఆయన అన్నారు.

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసిగా రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జెఎన్‌టియు గురజాడ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా యూనివర్శిటీలో సిఎస్ఇ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గతంలో వైస్ ఛాన్సలర్ గా ఉన్న వెంకట సుబ్బయ్య రాజీనామా చేయడంతో ఇన్‌ఛార్జి ఛాన్సలర్ బాధ్యతలను రాజ్యలక్ష్మికి అప్పగించింది.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

అవగాహన ర్యాలీలో జిల్లా జడ్జి కల్యాణచక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి

ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణచక్రవర్తి అన్నారు. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పాత జిల్లా కోర్టు సముదాయం నుంచి విటి అగ్రహారం వై జంక్షన్ వరకు గురువారం ఉదయం ఒన్ కె వాక్ ను నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ప్రతి తీఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో ఒక్క నెలలోనే సుమారు 3,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు తేలిందన్నారు. అందువల్ల ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇటీవలే తీర్పు చెప్పిందని వివరించారు మత్తుపదార్థాలను సేవించి వాహనాలను నడపకూడదని తెలిపారు. ర్యాలీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి, న్యాయమూర్తులు న్యాయమూర్తి ఎం.మీనాదేవి ఎన్.పద్మావతి, కె.నాగమణి, బిహెచ్‌వి లక్ష్మీకుమారి, రాజేష్‌కుమార్, బి.రమ్య, దేవిరత్నకుమారి, పి.బుజ్జి, ఎం.శ్రీనివాసరావు, డిఎస్‌పి గోవిందరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.హరీష్, వైస్ ప్రెసిడెంట్ దాసరి ఈశ్వరరావు, న్యాయవాదుల, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నాలుగు రోజుల పాటు వివిధ విభాగాల్లో జరగనున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (అండర్ 11,13 విభాగాలు) పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కెఎ నాయుడు ప్రారంబించారు. తొలి రోజు జరిగిన పోటీలకు అండర్ 11,13 విభాగంలో జిల్లా వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెఎ నాయుడు మాట్లాడుతూ అనంతపురంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు అండర్ 11 నుంచి సీనియర్స్ విభాగం వరకు జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు ఇవ్వడంతో పాటు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇందుకూరి రఘురాజు, కార్యదర్శి నున్నా సురేష్, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ విఎస్ ప్రసాద్, కుసుంబచ్చన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ జిల్లాలో గురువారం పలు పాఠశాలలను పరిశీలించారు. పూసపాటిరేగ మండలం పాతకొప్పెర్ల ప్రాథమికోన్నత పాఠశాలను ఉదయం ప్రార్థనా సమయానికి సందర్శించారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు గాను ముగ్గురు ఆలస్యంగా హాజరయ్యారు. ప్రార్థన అనంతరం 6వ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు అందజేసిన కిట్ లను పరిశీలించారు. అనంతరం ఎరుకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగు పరచాలన్నారు.ఎంఇఒలు పాఠశాలలనుపరిశీలించాలని చెప్పారు.

పారిశుధ్య పనితీరుపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కాలువను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ ఎంఎం నాయుడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. ప్రతి గురువారం డివిజన్ పర్యటనలో భాగంగా ఈరోజు ఒకటో డివిజన్‌లో పర్యటించారు. లక్ష్మీ గణపతి కాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానికంగా ఉన్న పరిసరాల స్థితిగతులను పరిశీలించారు. నిరుపయోగంగా పడి ఉన్న ఖాళీ స్థలాలలో చెత్తాచెదారాలు పేరుకుపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల పన్నులు విధింపును తప్పనిసరిగా పాటించాలని ప్రణాళికా కార్యదర్శులకు ఆదేశించారు. ఆయా ప్రాంతాలలో కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న సిబ్బందితో కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించి వేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు సూచించామన్నారు. అందరి సహకారంతో పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు, ఎంఇఇ, డిఇలు, ఎఇలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలు పరిశుభ్రంగా ఉంచాలి

వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. వర్షాలు కురుస్తున్ననేపథ్యంలో అంబటి సత్రం నుండి కొత్తపేట ప్రధాన రహదారి చుట్టుపక్కల ప్రాంతాలను ఇఇ కె.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. వర్షపు నీటికి అడ్డంకి లేకుండా కాలువల ప్రక్షాళనకు ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వండి

మంత్రి సంధ్యారాణికి అంగన్‌వాడీ యూనియన్ వినతి

ప్రజాశక్తి-సాలూరు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయానలి, మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరుతూ రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజయనగరం జిల్లా నాయకులు కోరారు. గురువారం సాలూరులో తన నివాసంలో జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంత్రిని కలిసి పలు సమస్యలపై వినతి అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేయాలని, 42 రోజులపాటు సమ్మె సందర్భంగా మినిట్స్ కాపీలో రాసిన జీవోలన్నీ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కళాకుమారి, సిహెచ్ కుమారి, పి.జ్యోతి, సుభాషిని, మాలతి, ఉమా, రూప, కామేశ్వరి, విశాల, రోజా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జి.సంధ్యారాణిని కలిసిన అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

మా మధ్య విభేదాలు లేవు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- భోగాపురం

కూటమి నాయకుల మధ్య ఎటువంటి విభేదాలూ లేవని, టిడిపి కార్యకర్తల్లో అసహనం ఉంటే నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు చూసుకుంటారని జనసేనలో అసహనం ఉంటే తాను చూసుకుంటానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. గతేడాది 5 వేలు సభ్యత్వాలు చేశామని ఈ ఏడాది పదివేలు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, న్యాయవాది సుధాకర్, పతివాడ శ్రీనివాసరావు, కర్రోతు శ్రీను, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ రద్దు పట్ల హర్షం

తెర్లాం: సిఎం చంద్రబాబు జిఒ నెంబర్ 54 రద్దు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయడంపై యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి. మునిస్వామి, కార్యదర్శి శంకర్రావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెద్ద ఎత్తున న్యాయ పోరాటాలు చేసినా గత ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందన్నారు. భవిష్యత్తులో ఈ జిఒను పూర్తిగా ఉపసంహరించుకొని పాత పెన్షన్ పద్ధతినే కొనసాగించాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు.

మాజీ సైనికులకు గ్రీవెన్స్

బొబ్బిలి: బొబ్బిలి పాత కోటలో గల వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్య ప్రసాద్, సంఘం అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత కొన్నేళ్లుగా అంగవైకల్యంతో మంచం పట్టి ఉన్న మాజీ సైనికుడు కొల్లి రామారావును వారి స్వగృహానికి పరామర్శించారు. ఏమైనా సహాయ సహకారాలు కావలసి ఉంటే సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఎంఎల్ రావు, సి. హెచ్.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సత్యారావు మృతి బాధాకరం

బొబ్బిలి: సీనియర్ వైద్యులు రెడ్డి సత్యారావు మృతి బాధాకరమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సత్యారావు పార్థివదేహాన్ని గురువారం సందర్శించి నివాళు లర్పించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారని ఆయన సేవలను కొనియాడారు. సత్యారావు మృతి ప్రజలకు తీరని లోటన్నారు.

క్షత్రియ పేద పిల్లలను ఆదుకునేందుకు కృషి

చీపురుపల్లి: క్షత్రియ సమాజంలో ఉన్న పేద పిల్లల విద్యాభివృద్ధికి, వికలాంగులను ఆదుకునేందుకు చీపురుపల్లి క్షత్రియ సేవా సమితి కృషి చేయాలని జిల్లా క్షత్రియ సంఘం అధ్యక్షుడు పెనుమత్స సీతారామరాజు అన్నారు. గురువారం స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన క్షత్రియ సేవా సమితికి జిల్లా శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సమాజంలో క్షత్రియులు గౌరవంగా జీవించే విధంగా దాతలు తోడ్పాటుని అందించాలని కుచ్చర్లపాటి త్రిమూర్తులురాజు సేవా సమితి సభ్యులను కోరారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలతో పాటు సమీప గ్రామాలలోని క్షత్రియులు హాజరయ్యారు. .

అధికారుల పనితీరు మారాలి

శృంగవరపుకోట: ప్రభుత్వం మారిందని అధికారుల తీరు కూడా మార్చుకోవాలని ఎంపిపి సండి సోమేశ్వరరావు అధికారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నీల మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం నెమ్మదిగా సాగుతుందన్నారు. ఆసుపత్రిలో ప్రతి చిన్న రోగానికి విజయనగరం, విశాఖపట్నం రిఫర్ చేస్తున్నారని ఆసుపత్రిలో ఏ ఒక్క పరికరం సరిగ్గా పనిచేయడం లేదని ఆలుగుబిల్లి ఎంపిటిసి రాయవరపు చంద్రశేఖర్ ప్రశ్నించారు. వైస్ ఎంపిపి సుధారాజు మాట్లాడుతూ జిందాల్ కంపెనీ నిర్మాణం పేరుతో భూసేకరణ చేసి రైతులను మోసం చేశారని జిందాల్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. చిలకల గడ్డ కాలువను ఆధునికరించి 40 చెరువులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసియ్య అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సాంబమూర్తి, తహశీల్దార్ అశోక్ కుమార్, పినిశెట్టి రమణ, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి లక్ష్మీ, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు యుటిఎఫ్ వినతి

బొబ్బిలి: నియోజకవర్గంలో పాఠశాలల సమస్యలపై ఎమ్మెల్యే బేబీ నాయనకు యుటిఎఫ్ నాయకులు గురువారం వినతినిచ్చారు. మండలంలో కొత్తవలస గిరిజన గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, రామభద్రపురం మండలంలో నేరెళ్ళవలసలో 1,2 తరగతులకు జిపిస్ పాఠశాల ఏర్పాటు చేయాలని, యుపి స్కూల్‌గా ఉన్న నేరెళ్ళవలస పాఠశాలను అప్ గ్రేడ్ చేయాలని, బొబ్బిలి పట్టణంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఎయిడెడ్ పాఠశాలను కొనసాగించాలని, ఇందిరమ్మ కాలనీలో గల మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను యుపిగా అప్ గ్రేడ్ చేయాలని, పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత పై విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, బొబ్బిలి మండలం, పట్టణం నాయకులు బత్తుల శ్రీనివాస్, వెంకటరావు, ఆనెం శ్రీనివాస్, పి.సత్యన్నారయణ, బాడంగి మండల నాయకులు రామారావు, నాగేశ్వరరావు, రామభద్రపురం నాయకులు స్వామి నాయుడు, మధుసూధనరావులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి - వేపాడ


మాట్లాడుతున్న కరస్పాండెంట్ రాఘవ

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీవిక్టరీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రాఘవ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ విక్టరీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ రాఘవ్ ఆధ్వ ర్యంలో గురువారం ఎస్‌పిఎల్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు ఎలా వేయాలి, ఓటుకు ఉన్న విలువ ఎంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌పిఎల్ ఎన్నిక కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాలినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకుంటే బీమా సౌకర్యం

విజయనగరం టౌన్ : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద భీమాసౌకర్యం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సభ్యత్వం పొందటం ద్వారా ప్రమాదానికి గురైతే 50వేల రూపాయల వరకు మెడికల్ పాలసీ, రూ.5 లక్షల ప్రమాద బీమాను అందిస్తున్నామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గ్రామ సందర్శన'

ప్రజాశక్తి - తెర్లాం

జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం గ్రామసందర్శన కార్యక్రమం ప్రారంభమైంది. పలు మండలాల్లో జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు.


పూసపాటిరేగ: రికార్డులను పరిశీలిస్తున్న జెసి కార్తీక్

మండలంలోని పలుకువలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు పాల్గొని గ్రామంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా శాఖల సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ మధుసూదన్‌రావు, ఎంఇఒ త్రినాధరావు, పంచాయతీరాజ్ శాఖ ఎఇ రాజశేఖర్, డాక్టర్ వెంకటేష్, అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ చంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు. **రేగిడి:** సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, డిఆర్‌డిఎ కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని పనసలవలస గ్రామంలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని ముందుగా అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ, జె.ఇ శ్రీచరణ్, ఎపిఎం గోవిందరావు, ఎపిఒ హరనాద్, ఎంఇఒ వరప్రసాదరావు, స్వచ్ భారత్ ఎంసిఒ పద్మ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలిరూరల్ :** గ్రామాలలో సమస్యలు తెలుసుకొనేందుకే గ్రామ సందర్శన కార్యక్రమాన్ని కలెక్టర్ తీసుకువచ్చారని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు అన్నారు. గురువారం మెట్టవలసలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు పరిశీలించారు. అనంతరం సర్పంచ్ పి.మాధవ గ్రామంలో విద్యుత్ సమస్యలు, మల్లం చెరువుకు నీరు పోయే మార్గంపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** రామతీర్థం గ్రామంలో నిర్వహించిన గ్రామసందర్శనలో మండల ప్రత్యేధికారి వి. శ్రీనివాసరావు పాల్గొని ఎంపిడిఒ జి.రామారావు,తహశీల్దార్ డి.ధర్మరాజుతో కలిసి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, సచివాలయాన్ని పరిశీలించారు. గ్రామంలో డ్రెయిన్లు నిర్మించాలని, ఉన్నత పాఠశాలలోకి వర్షపు నీరు రావడం, పాఠశాలలో విద్యుత్ సమస్య ఉందని పరిష్కరించాలని మాజీ సర్పంచ్‌లు కంచరాపు రాము, కోటపాటి తిరుపతిరావు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, సర్పంచ్ కంచరాపు సూర్య కళ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.**బొండపల్లి :** మండలంలోని గొట్లాంలో మండల నోడల్ అధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సందర్శన నిర్వహించారు. తొలుత బిసి కోలనీలో పర్యటించి అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందుతున్న సేవలపై నోడల్ అధికారి దుర్గాప్రసాద్, ఎంపిడిఒ హరిహరరావు, తహశీల్దార్ హనుమంతు రావులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న బోజనం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు అందిస్తున్న పలు సేవలను పరిశీలించారు. శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ అధికారులను కోరారు. **పూసపాటిరేగ:** గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికే గ్రామ సందర్శన కార్యక్రమానికి కలెక్టర్ పెట్టారని జెసి కార్తిక్ అన్నారు. గురువారం మండలంలోని పూసపాటిపాలెం పంచాయతీలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పేరాపురం సచివాలయంలో మండల స్థాయి అధికార్లతో రివ్యూ చేశారు. తమ గ్రామంలో గాయత్రి వాటర్ ప్లాంటు యాజమాన్యం కాలుష్యం నీటిని వదిలేస్తున్నారని, దాంతో గ్రామస్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామూర్తి జెసికి తెలిపారు. వీటిపై పరిశీలన చేసి రిపోర్ట్ ఇవ్వాలని అధికార్లుకు జెసి సూచించారు. పూసపాటిపాలెంలో తాగునీటి సమస్య ఉందని సర్పంచ్ రౌతు స్వామినాయుడు ఆయనకు వివరించారు. పాఠశాలకు, అంగన్వాడీకి ప్రహరీ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాదికారి బి. శాంతకుమారి, ఎంపిడిఒ రాధిక తదితరులు పాల్గొన్నారు.**వంగర:** గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కలెక్టర్ కె.సందీప్ మండలంలోని మగ్గూరులో గురువారం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎయిడెడ్ పాఠశాలను తనిఖీ చేశారు. భవనం పాతగా ఉండటంతో దీనికి నాడు నేడు కింద నిధులు రాలేదా అని అడిగారు. ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు మంజూరు కాలేదని ఎంఇఒ దుర్గారావు వివరించారు. అనంతరం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, ఎంపిడిఒ సల్మాన్ రాజు, తహశీల్దారు చిరంజీవి, టిడిపి నాయకులు అప్పలనాయుడు, వేగిరెడ్డి కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **సంతకవిటి:** మండలంలోని తాలాడ గ్రామంలో నిర్వహించిన గ్రామసందర్శనలో వివిధ ప్రభుత్వ పథకాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి. సుధాకర్, తహశీల్దార్, ఎంపిడిఒ, తలాడ సర్పంచ్ వడ్డీ గౌరీ, ఐటిడిపి నియోజకవర్గం అధ్యక్షులు భవిరి శ్రీనుబాబు పాల్గొన్నారు.**మెరకముడిదాం:** మండలంలోని రాచగుమడాం పంచాయతీలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమాన్ని ఎంపిడిఒ పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, రేషన్ డిపోని, పాఠశాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిఇఒ శ్రీధర్, నోడల్ అధికారి, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. **జామి:** జామి గ్రామంలో సమస్యలు తాండవిస్తున్నాయని అధికార, ప్రతిపక్ష పార్టీలు నాయకులు అధికారుల ముందు గ్రామసందర్శనలో ఏకరువు పెట్టారు. ప్రత్యేకదికారి సెట్విజ్ ఎఒ కృష్ణమూర్తి స్పందిస్తూ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షణ చేసేందుకు, నమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపిడిఒ వి. తిరుమలరావు, తహశీల్దార్ జి.రాంబాయి, ఇఒపిఆర్‌డి శ్రీదేవి, ఉపసర్పంచ్ అల్లు పద్మ, వర్రిరమణ, బండారు పెదబాబు, పోలిపర్తి స్వామినాయుడు, దనియాల పైడిరాజు, గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. **భోగాపురం:** మండలంలోని తూడెం గ్రామంలో ప్రత్యేకాధికారి సుదరాణి సమక్షంలో గ్రామసందర్శన నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని, పాఠశాలను పరిశీలించారు. అనంతరం సమావేశంలో గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, ఎపిఒ ఆదిబాబు, ఎఒ హరికృష్ణ, నాయకులు రీసు రమణ, కోరాడ తాతారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-చీపురుపల్లి

వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చీపురుపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి వై.ప్రేమలత అన్నారు. గురువారం మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై చీపురుపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె. కిరణ్ కుమార్ నాయుడు, జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ కుమార్, న్యాయవాదులు, విద్యార్థులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రేగిడి: ర్యాలీ చేస్తున్న జడ్జి, పోలీసులు, న్యాయవాదులు

రేగిడి: రాజాం మండల కేంద్రం కోర్టు ఆవరణలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు, మోటార్ వాహనాల చట్టంపై సీనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జ్ పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ సిఐ డి.మోహన్ రావు, రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్, ఎస్ఐ చంద్రశేఖర్, బారు అసోసియేషన్ అధ్యక్షులు కె రామినాయుడు, వైస్ ప్రెసిడెంట్ జయదేవ్, జాయింట్ సెక్రెటరీ ఎం శ్రీనివాసరావు, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కొత్త సాయి ప్రశాంత్ కుమార్, నీలకంఠేశ్వర యాదవ్, స్వచ్ఛంద సంస్థలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీస్ యంత్రాంగం పాల్గొన్నారు.

కొత్తవలస: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వాడి మీ ప్రాణాలను కాపాడుకోవాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి చైర్మన్ డాక్టర్ సముద్రాల విజయ చందర్ అన్నారు. గురువారం కొత్తవలస కోర్టు దగ్గర నుంచి రైల్వే స్టేషన్ వరకు నినాదాలతో న్యాయవాదులు, కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తవలస అంబేద్కర్ జంక్షన్‌లో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యకులు డి.వివిఎల్. దేవి, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కె.మహేశ్వర్, ఎమ్.వి.ఎస్. గిరిబాబు, ఎస్. శ్రీరామమూర్తి, జి.వి.రమణ, వై.జి.నాయుడు, సతీష్, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డిఎస్‌పి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో గురువారం హెల్మెట్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు ఐదు ప్రసవాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రభుత్వ ఆసుపత్రిల్లో నెలకు ఒకటీ.. రెండూ ప్రసవాలు జరగడమే గగనమవుతున్న తరుణంలో పూసపాటిరేగ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే రోజు ఐదు ప్రసవాలు చేసి ఆరోగ్య సిబ్బంది అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. పిహెచ్‌సిలో వైద్యులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి సమక్షంలో ఆరోగ్య సిబ్బంది గురువారం 24 గంటల్లో ఐదు ప్రసవాలు జరిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలకు ప్రసవానికి వస్తే మనకెందుకు రిష్కు అన్న వైద్య సిబ్బందిని మనం చూస్తుంటాం. కానీ పూసపాటిరేగ పిహెచ్‌సిలో ఆరోగ్య సిబ్బంది ఆసుపత్రిలోనే ప్రసవం చేయడానికి ప్రయత్నం చేయడంతో పాటు కుటుంబీకులును ఒప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఒక్క రోజే 5 ప్రసవాలు జరిపారు. సిజేరియన్ వద్దు సహజ ప్రసవాలే ముద్దంటూ వారి నినాదంను తెలుసుకున్న మండల వాసులు, గర్భిణుల కుటుంబీకులు వైద్యులును, ఆరోగ్య సిబ్బందిని అబినందిస్తున్నారు.

ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత?

బాడంగి: స్థానిక ఎత్తుకాన రైల్వే బ్రిడ్జి వద్ద రహదారికి బెర్మలు శిథిలమవడంతో ప్రమాదకరంగా మారిందని ఎదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సిపిఎం నాయకులు ఎ. సురేష్ ప్రశ్నించారు. బాడంగి సమీపంలోని ఎత్తుబ్రిడ్జిని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి కోట్లు రూపాయలు వెచ్చించి పనులు చకచకా చేశారే తప్ప నాణ్యత పాటించలేదన్నారు. రోడ్డు పక్కన ఒక వాహనం ఆపితే రోడ్డు కూరుకుపోయి పక్కనున్న సేఫ్టీ రాడ్లు సైతం పక్కకు ఒరిగిపోతున్నాయన్నారు. ఒక వాహనం పక్కన పెడితే ఇంత ప్రమాదం జరిగితే పదుల సంఖ్యలో టన్నులు బరువున్న వాహనాలు నిత్యం ఈ బ్రిడ్జిపై నుండి నడుస్తూ ఉంటాయని అప్పుడు బ్రిడ్జి పరిస్థితి ఏంటని నిలదీశారు. రైల్వే బ్రిడ్జి కాంట్రాక్టర్ కోట్ల రూపాయలు తీసుకుని నాణ్యత లేని రహదారి వేస్తే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రానున్న వర్షాకాలంలో వంతెన మరింత ప్రమాదంలోకి వెళ్లే అవకాశం ఉందని వెంటనే దీనిపైన ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని రైల్వే బ్రిడ్జి కాంట్రాక్టర్ పైన కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి అధికారులను కలిసి సమస్య వివరిస్తామని తరువాత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గంజాయిని అడ్డుకుంటాం

కొత్తవలస: జిల్లాలో అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని అడ్డుకుంటామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. గురువారం రాత్రి ఆయన కొత్తవలస పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి స్మగ్లింగ్ అరకు ప్రాంతం నుంచి ఎస్.కోట, కొత్తవలస మీదగా విశాఖపట్నం చేరుతుందని దీనిని అడ్డుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ఏ ప్రాంతంలో ఏఏ నేరాలు జరుగుతున్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి నేరాలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. జిల్లాలో నేరాలు అదుపు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తవలస స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని దానికి గల కారణాలు అన్వేషిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్ సుదర్శన్ సిబ్బంది పాల్గొన్నారు.

మా నియోజకవర్గంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - కొత్తవలస

ఎస్‌కోట నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రి నారా లోకేష్‌ని ఉండవల్లిలో తన నివాసంలో గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, రెల్లి గ్రామంలో కేంద్ర గిరిజన యూనివర్సిటీ పున ప్రారంభిస్తున్న తరుణంలో ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని కోరారు. ఎస్‌కోట మండలంలోని కెజిబివి, జామి మండలంలో ఏపీ మోడల్ స్కూల్, కొత్తవలస మండలం బలిగొట్టం గ్రామంలో ఎంఎస్ ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ కల్పనలో భాగంగా ఐటి సెక్టార్ విస్తరణకు నియోజకవర్గంలో అధికంగా ప్రభుత్వ భూమి ఉన్నందున ఐటీ సంస్థలు నెలకొల్పాలని కోరారు. నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు కృషి చేసిన నాయకులకు నామినేటెడ్ పదవులు విషయంలో తగు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయన్ను కలిసిన వారిలో విశాఖ పార్లమెంటు వెలమ సాధికారి సమితి కన్వీనర్ లాలం అర్జున్ రావు, ఎల్.కోట మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరావు, చింతలపాలెం సర్పంచ్ మాకెన నవీన్ పాత్రుడు, గోగాడ జగన్నాథంనాయుడు, యేడువాక గణేష్ తదితరులు ఉన్నారు.


మంత్రికి వినతినిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

జీతాలు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న 28 మంది పారిశుధ్య కార్మికులకు గత తొమ్మిది నెలల నుంచి జీతాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ గురువారం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ. గౌరినాయుడు మాట్లాడుతూ టెండర్ పేరిట వాళ్లు కట్టిన డబ్బులు 2017 నుంచి 2024 వరకు తిరిగి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. 9 నెలలు జీతాలు లేక అప్పులు చేసి జీవిస్తున్నారని ఇంకొక వైపు నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. అధికారులు స్పందించి కార్మికుల జీతాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు అప్పన్న, చంటి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ యాజమాన్యం వెంటనే స్పందించాలి

కొత్తవలస: జిందాల్ యాజమాన్యం వెంటనే స్పందించి పరిశ్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని జెఎసి నాయకులు కాకి సురేష్, అప్పలరాజు డిమాండ్ చేశారు. జిందాల్ కార్మికులు చేస్తున్న రీలే దీక్షలను ఆయన గురువారం సందర్శించి మాట్లాడారు. జిందాల్ పరిశ్రమ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని గత 63 రోజులుగా పోరాటం చేస్తున్నారని అందులో భాగంగా 33 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఈ దీక్షలు వర్షంలో కూడా గురువారం కొనసాగించినట్లు ఆయన తెలిపారు. యాజమాన్యం కార్మికులకు ఎటువంటి సమాచారం, నోటీస్ ఇవ్వకుండా కార్మిక చట్టాలను ధిక్కరించి అత్యంత దారుణంగా మే 17న అకస్మాత్తుగా గేట్ ముందు నోటీసు అంటించి 321 మంది కార్మికులను రోడ్డు మీదకు నెట్టి వేసిందన్నారు. రామెటీరియల్ తెప్పించుకొని పరిశ్రమ నడపవలసిన బాధ్యతను మరిచి కార్మికులకు నష్టం చేసే విదంగా వ్యవహరించిందన్నారు. గత 38 సంవత్సరాలుగా జిందాల్ అభివృద్ధికి కార్మికులు ఎంతగానో తోడ్పడ్డాడరని అటువంటి కార్మికులను యాజమాన్యం ఆదుకోకుండా అవస్థలు పడే విధంగా దుర్మార్గమైన చర్యలను చేపడుతుందని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల పోరాటాన్ని అర్థం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎన్.చిన్నబాబు, బి.ఈశ్వర్ రావు, పి.బంగారు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తేలు కరిచి వ్యక్తి మృతి

గుర్ల: మండలంలోని పున్నపురెడ్డి పేట గ్రామానికి చెందిన పున్నపురెడ్డి కనకనాయుడు(39) తేలు కాటుకు గురై మృతి చెందారు. పొలం పనులు నిమిత్తం బుధవారం పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో నువ్వు చేను దిబ్బల నుండి చేను తీస్తున్న సమయంలో తేలుకుట్టడంతో వెంటనే చికిత్స నిమిత్తం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లిమర్ల సిహెచ్‌ఎన్‌సికి అక్కడ నుండి విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు మృతుని భార్య కృష్ణవేణి తెలిపారు. అదే పొలంలో గత సంవత్సరం గుర్తు తెలియని విష పురుగు కుట్టి కుమార్తె మృతి చెందగా, అక్కడే తండ్రి కూడా తేలు కాటుకు గురై మృతి చెందడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. గుర్ల ఎస్ఐ భాస్కర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.